
## అండర్ బ్రిడ్జి వరకు నూతన వీధి దీపాలు ఏర్పాటు

ప్రజాభూమి, హిందూపురం టౌన్



హిందూపురం పట్టణంలో ఎస్.డి.జీ.ఎస్. కాలేజ్ రోడ్ నుండి గుడ్డం దేవాలయ రహదారి, అండర్ బ్రిడ్జి వరకు ఉన్న విద్యుత్ స్తంభాలకు నూతన వీధి దీపాలన ఏర్పాటు చేశారు. శనివారం సంబంధిత పనులను మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ పరిశీలించారు. విద్యుత్ స్తంభాలకు క్రొత్తగా వైర్ లాగి, 32 వాట్స్ సామర్థ్యం కలిగిన ఎల్ఈడి వీధి దీపాలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ, కొన్ని సంవత్సరాల నుండి విద్యుత్ దీపాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, గుడ్డం దేవాలయం వెళ్ళే అండర్ బ్రిడ్జి రోడ్డును విద్యుత్ దీపాలతో వెలుగులు నింపామని, వాహనదారులు, ప్రజలు ఎటువంటి ఇబ్బం దులకు కాకూడదని ఉద్దేశంతో వీధి దీపాలను ఏర్పాటు చేయించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో లైటింగ్ సూపర్ వైజర్ తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వీడాలి

### -త్యాగరాజ్ నగర్ లో స్వచ్ఛ సేవా - స్వచ్ఛ హిందూపురం

ప్రజాభూమి, హిందూపురం టౌన్



పట్టణ ప్రజలందరూ పారిశుద్ధంపై నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటి కప్పుడు సత్వర చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున సూచించారు. శనివారం హిందూ పురం పట్టణం త్యాగరాజ్ నగర్ లో తెలుగుదేశం పార్టీ యువత ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ సేవా – స్వచ్ఛ హిందూపురం కార్యక్రమంలో పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. ఆ ప్రాంతంలో చెత్తాచెదారాన్ని శుభ్రం చేసి, మురికి కాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగించారు. అనంతరం వారు మాట్లాడుతూ, తాగరాజ్ నగర్ లో ఉన్న ప్రజలు తమ ఇంటిలో ఉన్న చెత్తను కాలువలలో వేయడం వల్ల కాలువ నీరు అక్కడిక్కడే నిలిచిపోయి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నట్లు పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని చెత్తను చెత్త బండికి ఇవ్వాలని, వీధి వీధిలో ఉన్న చెత్తను పరిశుభ్రపరిచి చెత్త ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డుకు తరలించడం జరుగుతుందని తెలియజేశారు. అదేవిధంగా పారిశుద్ధ్య కార్మికులు కూడా ప్రజలు అందించే చెత్తాచెదారాన్ని నిర్లక్ష్యం చేయకుండా ఎంపిక చేసిన ప్రాంతాల్లో మాత్రమే డంప్ చేయాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు చెత్తాచెదారాన్ని తొలగించే సమయంలో సరైన భద్రతా ప్రమాణాల పాటించాలన్నారు. హిందూపురం పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు కార్మికులకు ప్రజలందరూ సహాయ సహకారాలు అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ యువత, పారిశుద్ధ్య కార్మికులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## వైయస్సార్సీపి పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరి కృషి ఎంతో అవసరం

### మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ప్రజా భూమి ధర్మవరం ప్రతినిధి



వైఎస్సార్సీపీ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరి కృషి ఎంతో అవసరమని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఇటీవల వైఎస్ఆర్సిపి ధర్మవరం పట్టణ క్లస్టర్–2 అధ్యక్షుడిగా కోటిరెడ్డి బాల్ రెడ్డి ని నియమించడంతోపాటు పట్టణ కమిటీని కూడా నియమించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే నివాసంలో జరిగింది. అనంతరం అందరూ కూడా కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మద్దిలేటి మల్లికార్జున,కత్తే పెద్దన్న, నాయకులు చాంద్ బాషా, సుభాన్ భాష, చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, చింతా మారుతి, కడప రంగస్వామి, గోరకాటి పురుషోత్తం రెడ్డి, బాలం గోపాల్, బడన్నపల్లి కేశవరెడ్డి, తిరుమల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**వైఎస్ఆర్సిపి నాయకుడికి పరామర్శ:** పట్టణములోని సిద్దయ్యగుట్ట లో గల వైఎస్ఆర్సిపి వార్డ్ ఇంచార్జ్ కుమారస్వామి అనారోగ్యంతో బాధ పడుతున్న విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పార్టీ అండగా ఎల్లప్పుడూ ఉంటుందని వారు భరోసా కల్పించారు.

## మృతి చెందిన ఆర్మీ జవాన్ మురళి నాయక్ కు 25 లక్షల రూపాయలు వ్యక్తిగత ఆర్థిక సహాయాన్ని అందించినచిలకం మధుసూదన్ రెడ్డి

ప్రజా భూమి ధర్మవరం ప్రతినిధి




పెనుకొండ నియోజకవర్గం గోరంట్ల మండలం తల్లితాండ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ మురళి నాయక్ భారత్ పాకిస్తాన్ యుద్ధంలో వీరమరణం పొందిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా జనసేన పార్టీ అధ్యక్షులు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్వయంగా తల్లితాండకు వెళ్లి మురళి నాయి కుటుంబ సభ్యులను పరామర్శించిన విషయం కూడా తెలిసిందేనని. ఇందులో భాగంగా పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీ మేరకు 25 లక్షల రూపాయల వ్యక్తిగత ఆర్థిక సహాయాన్ని చిలకం మధుసూదన్ రెడ్డి సంబంధిత చెక్కును అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ,మీ కుటుంబానికి ఎన్డీఏ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వారు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, అనంతపురం జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి. వరుణ్, జిల్లా నియోజకవర్గాల ఇంచార్జ్ నాయకులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం యొక్క లక్ష్యం

### జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి

ప్రజా భూమి ధర్మవరం ప్రతినిధి



రైతుల సంక్షేమమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వము యొక్క ముఖ్య లక్ష్యము అని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని రేగాటిపల్లి గ్రామపంచాయతీలో నిర్వహించిన వేరుశెనగ విత్తనాల పంపిణీ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులైన రైతులకు వేరుశనగ విత్తన మూటలను స్వయంగా వారు పంపిణీ చేశారు. తొలుత వేరుశెనగ విత్తన కాయలు లను వారు పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, నాణ్యమైన విత్తనాలను మాత్రమే అధికారులు పంపిణీ చేయాలని తెలిపారు. రైతుల ద్వారా నాణ్యతలేని విత్తనాలను వస్తే వాటిని వెనక్కి తీసుకొని నాణ్యమైన విత్తనాలను తిరిగి ఇవ్వాలని తెలిపారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా కల్తీ విత్తనాలకు చెక్ పెట్టాలని వారు సూచించారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ కృషి చేస్తూ ఉంటుందని, ప్రతి రైతుకు మద్దతుగా తమ ప్రభుత్వం నిలుస్తుందని తెలిపారు. వ్యవసాయ అధికారులు రైతుల యొక్క సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరించే దిశలో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయా అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## ఏకపక్షంగా ఇచ్చిన పదోన్నతులను రద్దు చేయాలి-కార్మిక కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం కల్పించాలి

### -ప్రతి వార్డుకు సమానంగా నిధులు కేటాయింపు చేయండి

### -కమిషనర్ ను కోరిన కౌన్సిలర్లు

ప్రజాభూమి, హిందూపురం టౌన్



గత కొన్ని నెలలుగా హిందూపురం పురపాలక సంఘంలో పాలకులకు తెలియకుండా అధికారులు ఏకపక్షంగా ఇచ్చిన పదోన్నతులు అన్నింటిని రద్దు చేయాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ను కౌన్సిలర్లు కోరారు. శనివారం మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ ఛాంబర్ లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తో కలిసి కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు గిరీష్, రాఘవేంద్ర తదితరులు పురపాలక సంఘంలో వివిధ విభాగాల్లో అధికారులు ఏకపక్షంగా పాలకవర్గానికి కనీస సమాచారాన్ని ఇవ్వకుండా పదోన్నతులు కల్పించారని, పదోన్నతులు కల్పించిన అనంతరం కౌన్సిల్ దృష్టికి సైతం పూర్తిస్థాయిలో తీసుకురాలేదని, వెంటనే అలాంటి పదోన్నతులను రద్దుచేసి, నూతనంగా నోటిఫికేషన్ విడుదల చేసి భర్తీ చేయాలని కోరారు. ఆప్కాస్ కింద విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులను 60 సంవత్సరాలు పూర్తి కావడంతో కొంతమందిని తొలగించడం జరిగిందని, తొలగించిన కార్మికుల స్థానంలో ప్రథమ ప్రాధాన్యత కింద వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వారి కుటుంబంలో ఎవరూ రాకపోతే ఇతరులకు అవకాశం కల్పించాలన్నారు. పట్టణంలో ఉన్న సచివాలయాల్లో ప్రజా ప్రతినిధులకు సచివాలయ ఉద్యోగులు కనీస గౌరవం ఇవ్వడం లేదని కమిషనర్ ముందు కొంతమంది కౌన్సిలర్లు వాపోయారు. దీనిపై కమిషనర్ వెంటనే స్పందించి సచివాలయ కార్యదర్శులు అందరికీ సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని ప్రజా ప్రతినిధులకు ఇవ్వాల్సిన ప్రాధాన్యత పై వారికి సూచించడంతో పాటు సచివాలయాల్లో వార్డు కౌన్సిలర్లకు ప్రత్యేక చైర్ సైతం ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పురపాలక సంఘంలో విధులు నిర్వహిస్తున్న అధికారుల మధ్య సమన్వయ లోపం ఉందని, దీంతో కార్యాలయంలో పనులు త్వరతగితిన పూర్తి కావడం లేదని, దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కమిషనర్ ను కోరారు. పట్టణంలో కార్మికుల సంఖ్య తక్కువ ఉండడంతో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేదని, పట్టణ జనాభాకు తగ్గట్టు కార్మికుల సంఖ్యను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై స్పందిస్తూ కమిషనర్ ఇప్పటికే పురపాలక సంఘంలో పారిశుద్ధ్య కార్మికులు ఆప్కాస్ కింద 194 మంది కార్మికులు, 54, కోవిడ్ కార్మికులు, కాంట్రాక్ట్ 84 మొత్తం 334 మంది ఉన్నారని, పట్టణ జనాభాకు అనుగుణంగా కౌన్సిల్ సహకారంతో కార్మికుల సంఖ్యను పెంచే విధంగా చర్యలు చేపడతామన్నారు. నిధులు కేటాయింపులు సరిగా లేకపోవడంతో వార్డుల్లో చిన్నచిన్న పనులు సైతం చేయలేకపోతున్నామని, ప్రతి వార్డుకు ప్రత్యేక నిధులు కేటాయించి, ప్రజలకు అవసరమైన చిన్న చిన్న పనులను పూర్తి చేయాలని కోరారు. ఈ విషయంపై చైర్మన్ రమేష్ కుమార్ స్పందించి ప్రతి వార్డుకు రూ. 3 లక్షలు కేటాయించి, ప్రజలకు అవసరమైన చిన్న చిన్న పనులు అన్నిటిని పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్ కు సూచించారు. మరో రెండు నెలల్లో వినాయక ఉత్సవం ఉందని, ఆ ఉత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ఇప్పటి నుంచే చేపట్టాలని కౌన్సిలర్ రాఘవేంద్ర కోరారు. అదేవిధంగా గుడ్డం కోనేరు పక్కన మరొక కోనేరు ఉందని దానిని సైతం వినియోగంలోకి తీసుకువస్తే వినాయక నిమజ్జనాన్ని త్వరగా పూర్తి చేయడానికి అవకాశాలు ఉన్నాయన్నారు. పురపాలక సంఘ ఆధ్వర్యంలో నిర్మాణం చేసిన మున్సిపల్ వాణిజ్య భవనం పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకు రాకపోవడంతో చాలా నష్టం జరుగుతున్నదని, దానిని వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. వీటన్నింటి పైన కమిషనర్ స్పందించి స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సూచనలు, ప్రజా ప్రతినిధుల సహకారంతో పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. ఇప్పటికే పట్టణ అభివృద్ధి కోసం రూ. 92.50 కోట్లు పరిపాలన మంజూరు కావడం జరిగింది. దీనికి సంబంధించి విధి విధానాలను పూర్తి చేసి ఆ నిధులను తీసుకువచ్చి ఆయా వార్డు కౌన్సిలర్ల సూచనల మేరకు నిధులను కేటాయింపు చేసి పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపించుకుందామన్నారు. చైర్మన్ సూచనల మేరకు ప్రతి వార్డుకు నిధులు కేటాయింపు చేసి, ఇంజనీరింగ్ అధికారుల సూచనల మేరకు ప్రజలకు అవసరమైన పనులను పూర్తి అయ్యే విధంగా చూస్తామన్నారు. మున్సిపల్ వాణిజ్య భవనాన్ని పరిశీలన చేసి, వ్యాపారులకు, ప్రజలకు ఎలాంటి అవసరాలు ఉన్నాయని తెలుసుకొని వాటిని పూర్తి చేసి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకుని వచ్చి, పురపాలిక ఆదాయాన్ని పెంచే విధంగా చర్యలు చేపడతామన్నారు. ప్రజా ప్రతినిధులు అందరూ సహకరిస్తే పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం చైర్మన్ రమేష్ కుమార్ తో సహా కౌన్సిలర్లు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ మల్లికార్జునను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## 'తల్లికి వందనం' చారిత్రాత్మకం

### -సీఎం, డిప్యూటీ సీఎం, లోకేష్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

ప్రజాభూమి, హిందూపురం టౌన్



రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని అమలు చేయడం ఓ చారిత్రాత్మకమని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్ పేర్కొన్నారు. తల్లికి వందనం పథకంలో భాగంగా తల్లులు ఖాతాల్లోకి నగదు జామ అయిన సందర్భంగా శనివారం పట్టణంలోని నాలుగు సింహాల ఎన్టీఆర్ సర్కిల్ లో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చిత్ర పటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం తల్లికి వందనం పథకం కింద తల్లుల ఖాతాల్లో నగదు జమ చేయడం జరిగిందన్నారు. వైకాపా పార్టీ తల్లికి వందనం పథకంపై ఎంతో అవహేళనగా చిత్రీకరించిన ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కుటుంబంలో ఎంత మంది ఉన్నా అంత మంచి పిల్లలకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేసిన ఘనత ముఖ్య మంత్రి చంద్రబాబుకే దక్కుతుం దన్నారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎన్నో సంస్కరణలు తీసు కొచ్చారని, తద్వారా విద్యా వ్యవస్థ గృహ అభివృద్ధి సాధిస్తుందన్నారు. అనంతరం వారి చిత్ర పటాలకు పాలాభిషేకం చేసి, కూటమి ప్రభుత్వం వర్ధిల్లాలి అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ధర్మవరం పట్టణంలో హిందూ స్మశాన వాటిక ఏర్పాటుకు మంత్రి సత్యకుమార్ యాదవ్ చొరవ

### ధర్మవరం స్మశాన వాటిక సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు

### శాంతమైన వాతావరణంలో స్మశాన వాటిక ఏర్పాటుకు చర్యలు

### ఫోనిక్స్ ప్రతినిధులతో కలిసి స్థల పరిశీలనలో బిజీగా మంత్రి బృందం

ప్రజా భూమి ధర్మవరం ప్రతినిధి



పట్టణంలోని హిందూ స్మశాన వాటికల కొరత వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తక్షణమే స్పందించారు. పట్టణంలో స్మశాన వాటిక స్థలాల యొక్క తీవ్ర లోపం కారణంగా శవసంస్కార కార్యక్రమాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై మంత్రి దృష్టి సారించారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని మంత్రి ఫోనిక్స్ కంపెనీ ప్రతినిధి రుద్ర కుమార్ తో చర్చించారు. ఈ సందర్భంలో, మంత్రి ఆదేశాల మేరకు ఫోనిక్స్ కంపెనీ ప్రతినిధి రుద్ర కుమార్ కలిసి మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు,మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ పట్టణంలోని డంప్యార్డ్ ప్రాంతాన్ని సందర్శించారు. ప్రత్యక్షంగా స్థలాన్ని పరిశీలించిన అధికారులు, డంప్యార్డ్ ప్రాంతం స్మశాన వాటిక ఏర్పాటుకు అత్యంత అనువైనదిగా ఉందని గుర్తించారు. శాంతమైన వాతావరణంతో ఉండటమే కాక, దహన సంస్కారాల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయగలిగే సామర్థ్యం ఉన్న ప్రాంతమని నిపుణుల అభిప్రాయమని వారు వెల్లడించారు. అలాగే, ఇప్పటికే ఉన్న పాత స్మశాన వాటికను కూడా పరిశీలించి, అక్కడ మరమ్మతులు మరియు అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టాలని నిర్ణయించారు. హిందూ సమాజానికి మరింత గౌరవంగా, సౌకర్యంగా శవసంస్కారాలు నిర్వహించుకునేలా వీరు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ప్రయత్నం ద్వారా ధర్మవరం పట్టణ ప్రజలకు ఎంతో కాలంగా ఎదురవుతున్న సమస్యకు శాశ్వత పరిష్కారం దక్కనుంది. మంత్రి చొరవకు ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డి.ఈ. వీరేష్, జాతీయ కౌన్సిల్ సభ్యులు అంబటి సతీష్, ధర్మవరం పట్టణ అధ్యక్షులు చంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు సాకే ఓబ్లేష్, జిల్లా మైనార్టీ నాయకులు నబి రసూల్, బిజెపి నాయకులు బిల్లే శ్రీనివాసులు, డోలా రాజారెడ్డి, వీరనారప్ప, జూటూరు వెంకటేష్, పోతుకుంట రాజు, చంద్రమౌళి, నారప్ప,పవన్ కుమార్ రెడ్డి,చంద్ర మహేష్,బోయ నర్సింహులు,వడ్డే శీన,తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా క్రికెట్ జట్టుకు ధర్మవరం బాలిక ఎంపిక

ప్రజా భూమి ధర్మవరం ప్రతినిధి



పట్టణంలోని ఆర్డిటి స్పోర్ట్స్ సెంటర్లో ప్రతిరోజు మైత్రి అనే విద్యార్థిని ప్రాక్టీస్ చేస్తోంది. ఈ సందర్భంగా అండర్ 19 బాలికల విభాగంలో నెల్లూరులో ఈ నెల 18 నుండి 24వ తేదీ వరకు జరిగే జిల్లా క్రికెట్ టోర్నమెంటులో అనంతపురం జట్టుకు ఎంపిక కావడం జరిగిందని ఆర్డిటి క్రికెట్ కోచ్ రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆర్ డి టి ఇస్తున్న ఈ ఉచిత క్రికెట్ కోచింగ్ ఎంతోమంది క్రీడాకాలకు ఉపయోగపడుతుందని, పేదవారై ఉండి క్రికెట్లో రాణిస్తున్నారని, క్రీడల్లో రాణించాలి అంటే డబ్బు లేకపోయినా ఆర్డిటి ఆదుకోవడం నిజంగా గర్వించదగ్గ విషయమని తెలిపారు. డబ్బు లేకపోయినా క్రీడల పట్ల ఆసక్తి గల క్రీడాకారులకు ఆర్డిటి చేస్తున్న సహాయ సహకారాలు మరువలేనిదని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికైన మైత్రి మాట్లాడుతూ, ఆర్డిటి సంస్థకు తాను రుణపడి ఉంటారని తెలుపుతూ కోచుకు ఆర్డిటికు కృతజ్ఞతలు తెలియజేసింది.

## జర్నలిజం గెలిచింది: కే వీ రమణ

ప్రజాభూమి బ్యూరో, అనంతపురం



సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు పై కేసు పెట్టడం అక్రమమని, 70 ఏళ్ల వయసులో జైలుకు పంపడం అన్యాయమని, జర్నలిస్టు సంఘాలు, మేధావులు చెప్పినా పెడచెవిన పెట్టి కక్ష కట్టి జైలుకు పంపారనీ అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు కెవి రమణ ఒక ప్రకటనలో అన్నారు. శనివారం తన కార్యాలయంలో మాట్లాడుతూ నేడు సుప్రీం కోర్టు శ్రీనివాసరావు అరెస్టు అక్రమమని, భావ ప్రకటనా స్వేచ్ఛను హరించడమేనని విలక్షణమైన తీర్పు ఇచ్చిందన్నారు. ఎటువంటి సంబంధంలేని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్లు పెట్టి, ఆంధ్ర పోలీస్ తన ప్రతిష్టను దిగదార్చుకున్నదని శ్రీనివాస రావు అరెస్టే అనైతికమైతే ఎస్సీ, ఎస్టీ సెక్షన్లు ఏ విధంగా పెడతారని ఆక్షేపించింద న్నారు. ఇలాంటి కేసులో కూటమి ప్రభుత్వం ఇతనితో పాటు సాక్షి యాజమాన్యం భారతి, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కూడా క్షమాపణ చెప్పాలని పట్టు బట్టారన్నారు. నిస్సిగ్గుగా తమ కార్యకర్తలతో ఊరు వాడా ప్రచారం చేశారు, దీనిని బట్టి అది కూటమి ఆర్గనైజ్డ్ కుట్ర అని తేలి పోయిందన్నారు. చట్ట వ్యతిరేక కార్య క్రమాలకు పూను కున్నారని సుప్రీంకోర్టు సంబంధిత పోలీసులకు నోటీసులు కూడా జారీ చేసిందన్నారు. అయినా నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు అన్నట్లు రాష్ట్ర పోలీసు వ్యవస్థ, శాంతి భద్రతలను పర్యవేక్షించే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు.. ఒకవేళ మేము రాజీనామాలు చేయవలసి వస్తే ఆనాడే చేయాల్సింది అన్నట్లు, ఖాతరు చేయకుండా పదవిని అంటిపెట్టు కొని వేలాడడం వీరి నీచ సంస్కృతికి అద్దం పడుతుందన్నారు. ఏడుసంవత్సరముల లోపు శిక్ష పడే నేరాలకు 41 సెక్షన్ కింద నోటీసు ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పును పోలీసులు పాటించలేదని, కేఎస్ఆర్ లైవ్ షో లో గెస్ట్ చేసిన వ్యాఖ్యలకు యాంకర్ ఎలా బాధ్యత వహిస్తారని, అలాంటి అభ్యంతరకర వ్యాఖ్యలు చేయొద్దని గెస్ట్ ను యాంకర్ నియంత్రించలేరని, కొమ్మినేనికి గతంలో ఎలాంటి నేర చరిత్ర లేదని, స్థానిక కోర్టులో కొమ్మినేని తరఫున న్యాయవాదిని అనుమతించక పోవడం, మాట్లాడే ప్రాథమిక హక్కు ఆర్టికల్ 19,21,22 (1)ను ఉల్లంగించారన్నారు. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన మీడియా గొంతు నొక్కే ప్రయత్నం చేశారని, అక్రమ అరెస్టుతో ఆయన జీవించే హక్కునకు భంగం కలిగించారని సుప్రీంకోర్టు తీవ్రంగా ఆక్షేపించిందన్నారు. కావున నైతిక బాధ్యత వహించి ముఖ్యమంత్రి, డిజిపి వెంటనే రాజీనామా చేసి, తమ పదవులకు హుందాతదాన్ని కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా సంఘ నాయకులు పాల్గొన్నారు.

